# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JUNE-2013

సంవత్సర చందా రూ.50/-

క్రీస్తు సంఘములు సమర్పించు

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

**ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త**

**ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ**

**ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ**

**ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన**

**ఛానల్‌లలో వీక్షించండి**

ఉచిత బైబిల్ కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆకోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును


మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం.80,**

**కాకినాడ.ఎ.పి, 533 001**

**ఫోన్: 0884 - 2363722**

# సత్యవాక్యు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | జూన్ - 2013 | సంచిక - 11


## క్రీస్తు సంఘము
## (The Church, of Christ)

ప్రపంచమందతటను ఈనాడు అనేక సంఘములు ఉన్నవి. అవన్నియును యేసుక్రీస్తు సంఘములేయని వారు చెప్పుకొనుచూ యుంటారు. వీటిలో ఉన్న ఒక విశేషము ఏమంటే, ఆయా సంఘములవారు ఒకదానికంటె మరియొక దానికి వేరుగాయున్న బోధలను, సిద్ధాంతములను వారు బోధించుచు, అనుసరిస్తూ యుంటారు. నిజానికి వారి వివిధ బోధల వలన నేడు క్రైస్తవలోకము అంతయును విభజింపబడి యున్నది. ఈలాగున విడిపోయియున్న శాఖలలో ఏది నిజమైన క్రీస్తుసంఘము? ఏది నిజమైన క్రీస్తు శరీరము? అనే ప్రశ్నలు మీాకు రావచ్చును.

దేవుడు తన సంఘమును స్థాపించుటకొరకు గొప్ప క్రియలను చేసెను. చివరకు తన కుమారుని సంఘము కొరకు బలిగా అర్పించెను. సర్వలోకమునందున్న సర్వ మానవుల కొరకు ఆయన ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. ఈ సంఘము శాఖోపశాఖలుగా విడిపోవలెనని ఆయన ఎన్నడును కోరనేలేదు, సరిగదా యేసుక్రీస్తు తన అనుచరుల

యొక్క ఐక్యతకొరకు ప్రార్థించెను. "తండ్రీ! నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రమే నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచువారం దరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" అని ఆయన ప్రార్థించెను (యోహాను 17:20-21). కొరింథులో యున్న సంఘములో చీలికలు రాగా అపొస్తలుడైన పౌలు వాటిని ఖండిం చెను: "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, ఏక మనస్సుతోను, ఏక తాత్ప ర్యముతోను, మీరు సన్నద్ధులై యుండ వలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను. (1 కొరింథీ 1:10- 13).

యేసుక్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. "నాసంఘమును నేను కట్టుదును" అని ఆయన చెప్పెను. "శరీరము ఒక్కటే"యని వాక్యము చెప్పు చున్నది, ఆ శరీరము సంఘము అని కూడా అది చెప్పుచున్నది. గనుక క్రీస్తుకు ఉన్న సంఘము ఒక్కటే. అయితే ఆ ఒక్కటే సంఘము ఏది? అది ఏమై యున్నది ? (మత్త 16:18; ఎఫె 4:4; కొలస్స 1:18).

క్రీస్తు సంఘము ఒక డినామినేషన్ కాదు. అది అనేక డినామినేషన్ల కలయిక అంతకు ముందే కాదు. అది క్రైస్తవ మత శాఖ కాదు, అది కేథలిక్కు సంఘము కాదు, ప్రొటెస్టాంట్ సంఘము కూడా కాదు, అది ఒక తెగకాదు, అది ఒక మనుష్యునితో ఆరంభించబడలేదు, దానికి ఒక మానవుడు అధికారిగా లేడు. మానవుల ఆధిపత్యమున అది నడచు కొనదు. అది మనుష్యుల పేరులను అసలే ధరించదు. మనుష్యులు వ్రాసిన ప్రమాణ పుస్తకము లనుబట్టి అదినడువదు. అది రాజకీయముగాగాని, సాంఘికముగాగాని ఉన్న ఒక సంస్థ కాదు ; అయితే అదేమిటి? అని మీరడుగవచ్చును. అదే క్రీస్తు సంఘము, అదే బైబిలు సంఘము, అదే నిజసంఘము.

సంఘము అను పదము 'ఎక్లీషియా' అను గ్రీకుపదము నుండి వచ్చినది. ఎక్లీషియా అనగా పిలువబడినవారు అని అర్థము, గనుక సంఘములో ప్రత్యేకము గా పిలువబడినవారుందరు, క్రీస్తుసంఘ ములో, క్రీస్తుసువార్త ద్వారా పిలువబడిన వారుంటారు. "ఆయన మనలను తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని అపొస్తలుడైన పౌలు వ్రాసెను (కొలస్స 1:13).

క్రీస్తుసంఘమును స్థాపించెను. "నా సంఘమును నేను కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు" అని యేసుక్రీస్తు చెప్పెను

(మత్తయి 16:18). సంఘమును కట్టిన వాడు ఆయనే గనుక సంఘము ఆయనదే. ప్రభువు తన స్వరక్తమిచ్చి ఈ సంఘమును సంపాందించెను (అపొ.కా. 20:28). గనుక ఏ సంఘమైనను క్రీస్తుద్వారా నిర్మించబడకపోయినయెడల అది క్రీస్తుసంఘమెట్లు కాగలదు?

సంఘమునకు పునాది యేసు క్రీస్తే: "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు;ఈ పునాది యేసుక్రీస్తే" అని పౌలు వ్రాయుచున్నాడు (1కొరింథీ 3:11). ముఖ్యమైన మూల రాయి కూడా క్రీస్తే. "క్రీస్తుయేసే ముఖ్యమైన మూలారాయియై యుండగా అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు" అని ఎఫెసులోని క్రీస్తుసంఘమునకు పౌలు వ్రాసెను (ఎఫెసీ 2:20).

క్రీస్తుసంఘము యెరూషలేములో ఆరంభింపబడును అని దేవుడు యెషయా ద్వారా ప్రవచించెను (యెషయా 2:3). అది యెరూషలేములోనే ఆరంభమా యెనని అపొస్తలులకార్యములు 2వ అధ్యాయములో మనకు తేటగా కన్పడు చున్నది. నీవు సభ్యత్వము కలిగియున్న సంఘము ఎక్కడ ఆరంభమాయెను? అది యెరూషలేములో, పెంతెకోస్తు అను పండుగదినమున కానియెడల అది క్రీస్తు సంఘము కాదు.

క్రీస్తుసంఘము మొదటి శతాబ్ద ములో 33వ సంవత్సరమున యెరూషలే ములో స్థాపించబడెను. క్రీస్తే దానిని స్థాపించెను గనుక ఆ సంఘము నీది గాని మరి యే మానవునిదిగాని కాదు. అది ఇంగ్లాండు దేశములో ఆరంభించలేదు. గనుక అది (Church of England) కాదు. అది అమెరికాలో ఆరంభించలేదు. అందు వలన అది ఒక అమెరికా సంఘము కాదు. అది ఇంచుమించు రెండువేల సంవత్స రముల క్రితమే ఆరంభమాయెను గనుక అది ఒక క్రొత్త సంఘము కాదు.

నిజమైన సంఘము దానిని స్థాపిం చినవాని నామమును ధరించును. సంఘమును స్థాపించినవాడు క్రీస్తు, దాని శిరస్సు క్రీస్తు, దాని రక్షకుడు క్రీస్తు దాని పునాది క్రీస్తు, ముఖ్యమైన మూలరాయి క్రీస్తు అని క్రొత్తనిబంధన మనకు విపులముగా బోధించుచున్నది. సంఘము నకును క్రీస్తుకును ఇట్టి సన్నిహిత సంబంధమున్నది గనుక సంఘము ఆయన నామమునే ధరించవలెనుగదా? "క్రీస్తు సంఘములు మీకు వందనములు చెప్పు చున్నవి" అని పౌలు రోమా 16:16లో వ్రాసెను. క్రొత్తనిబంధనలోని సంఘము, దేవుని సంఘము (1కొరింథి 1:2). సజీవముగల దేవుని సంఘము (1తిమోతి 3:15), ప్రభువు సంఘము (అపొ.కా. 20:28), క్రీస్తుసంఘము (రోమా 16:16).

అని వివరించబడి యున్నది.

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. సంఘము ఆయన యొక్క ఆత్మీయ శరీరమై యున్నది (కొలస్స 1:18). భూసంబంధమైన వ్యక్తి ఎవడును దీనికి భూమిపై అధికారిగా లేడు. "పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికార మీయబడి యున్నది" అని యేసు చెప్పెను (మత్తయి 28:18). గనుక క్రీస్తు సంఘమునకు భూమిపై ఒక ముఖ్య కేంద్రము (Head Quarter ) లేదు.

క్రీస్తుసంఘము మానవులచే వ్రాయబడిన ఒక విశ్వాసప్రమాణ పుస్తకమును (Creed Book) అనుసరించి నడువదు. సంఘ విశ్వాసమునకు, ఆచరణకు అది క్రొత్తనిబంధననుసరించి నడుచును. బైబిలు ఏమి పల్కునో దానినే అది బోధించును. బైబిలు ఎక్కడ మౌనియగునో అక్కడ అది మౌనియగును. బైబిలు సంగతులను అది బైబిలు పేర్లతో పిలుచును. "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది". గనుక అది మానవ కల్పిత గ్రంథముల ననుసరింపదు (2 తిమో 3:17).

క్రీస్తుసంఘ సభ్యులు క్రైస్తవులు అని మాత్రమే పిలువబడుదురు. క్రొత్త నిబంధనలో మీరుక్రైస్తవులను గూర్చి చెప్పబడుట చూడగలరు. అంతియొకయలో క్రీస్తు శిష్యులు మొదట క్రైస్తవులనబడిరి అని అపొ.కా. 11:26 లో మనము చూడగలము. అందువలన క్రీస్తు సంఘ సభ్యులు కేవలం క్రైస్తవులు అని మాత్రమే పిలువబడుదురు. వారు కేథలిక్కు క్రైస్తవులు, ప్రొటెస్టాంట్ క్రైస్తవులు కాదు. వారు ఒక డినామినేషన్ క్రైస్తవులు అంతకు ముందే కాదు. గాని వారు కేవలం క్రైస్తవులు మాత్రమే. రకరకాలైన క్రైస్తవులను గూర్చి బైబిలు బోధించుట లేదు.

ప్రపంచమందంతటా వేలకొలది యున్న వ్యక్తి గత సంఘములతో (అంటే డినామినేషన్లతో కాదు) క్రీస్తు సంఘము ఏర్పడి యున్నది. ప్రతి స్థానిక క్రీస్తు సంఘము క్రీస్తునందు స్వతంత్రత కలిగి యున్నది. అయితే ఈ స్థానిక సంఘములన్నియును ప్రేమచేతను, ఏకాభిప్రాయము చేతను కలిసిబంధింపబడి యున్నవి.

అపొస్తలులకాలములో ఈ సంఘ సభ్యులగుటకు ఒకే ఒక మార్గము ఉండెను. యేసుక్రీస్తు సువార్తను వినినవారు దానిని విశ్వసించి, వారి పాపములను గూర్చి మారుమనస్సునొంది, క్రీస్తును ఒప్పుకొని, వారి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. అట్లు వారు రక్షింపబడినందున సంఘముతో ప్రభువుచే చేర్చబడిరి.

నీవుకూడా యేసునందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినయెడల, ఈనాడే యేసుక్రీస్తు నిన్ను తన సంఘముతో చేర్చును.

## ఆవగింజ ఉపమానము

(మత్తయి 13:31-32; మార్కు 4:30-32 , లూకా 13:18-19)

పరిచయము :

తీరికలేకుండా యేసు ఆరోజు ఉపన్యసించుచునే యున్నారు. ఆయన మరికొన్ని ఉపమానములను ప్రజలకు వినిపించారు. ఆవగింజను గూర్చిన ఉపమానము, పులిపిండిని గూర్చిన ఉపమానము రెండు వెనువెంటనే చెప్పబడిన ఉపమానములు.

ఆవగింజను గూర్చిన ఉపమానము పరిపూర్ణమైనది. దానికి ఆయన వివరణ ఇయ్యలేదు. యేసు తాను చెప్పిన రెండు ఉపమానములకు మాత్రమే భావార్థము చెప్పెను, విత్తువానిని గూర్చినది, గురుగులను గూర్చినది.

ఆవగింజను గూర్చిన ఉపమానము బహుసంక్షిప్తమైనది గనుక అది ప్రత్యేకమైనది. మత్తయి, మార్కు సువార్తలలో రెండు వచనములలోను లూకా సువార్తలో మూడు వచనములలోను అది చెప్పబడెను. అయినను అందులో లోపించిన పదములు యేమీలేవు. అది మన ప్రభువుచే బోధింపబడినది గనుక, అది ఉన్న రీతిగానే పరిపూర్ణమైనది.

భావార్థము చెప్పేటప్పుడు కొందరు సూక్ష్మముగా యున్న ఉపమానములను గూర్చి తొట్రిల్లుదురు. మన ప్రభువు చెప్పిన ప్రతి ఉపమానములోను ఒక ముఖ్య భావముండును. గాని తరుచు బోధకులు వాటిని వక్రీకరించి అబద్ధ బోధకు దోహదపడుదురు.

గనుక ప్రతి బైబిలు విద్యార్థి కూడ ఆదైవిక వర్తమానము యొక్క ఆదిమ భావార్థము ఏమిటో, దానిని వినిన వారెట్లు గ్రహించుకొని యుండిరో తెలిసికొనుటకు ప్రయత్నించాలి. ఏదైనా వచనము బోధించని దానిని సత్యమని బోధించుటకు ప్రయత్నం చేయరాదు. అది అసత్యమగును. లేఖనములు బోధించు సత్యమునే మనము బోధించాలి. అసత్యమును ఎన్నడు బోధించరాదు.

ఉపమానము :

"ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను -పరలోక రాజ్యము ఒకడు తీసికొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలియున్నది. అది విత్తనములన్నిటిలో చిన్నదేగాని పెరిగినప్పుడు కూర

మొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశ పక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించు నంత చెట్టగును" (మత్తయి 13:31-32).

పరలోక రాజ్యము చాల చిన్న దిగా ఆరంభమగునని చెప్పుట ఈ ఉపమానము యొక్క ఉద్ధేశ్యమని ఒక లేఖకుడు చెప్పాడు . అది సూక్ష్మముగా ఆరంభమై గొప్ప సంస్థగా పెరుగుననుట దీని ఉద్ధేశ్యము. అది స్వల్పముగా ఆరంభమై గంభీరముగా అభివృద్ధి జెందునని మరియొక సహోదరుడు చెప్పాడు.

గొప్ప సంగతులు సాధిస్తే దానిని ఆధునిక మానవుడు విజయముగా పరిగణిస్తాడు. అందు వలన మనము మెగాస్టోర్స్, మెగామాల్స్, సూపర్ బజార్లు, సూపర్ టేంకర్లు మొదలగు వాటిని చూచి గర్విస్తాము. అయితే ఉపమానములో యేసు చాల చిన్న దానిని, పరిగణింప వీలులేని దానిని ఉదహరించారు. ప్రభువు రాజ్యము ఆరంభదశలో చిన్నగా, గమనంచదగనిదిగా, చిన్నగింజవలె ఆరంభమయ్యింది. లోకస్థులకు అది చాల చిన్న సంగతివలె కన్పడింది. గాని ఆవగింజ నుండి వచ్చిన మొక్కవలె అది చిన్నగా ఆరంభించినా, దాని అభివృద్ధి గొప్ప దాయెను. ఎన్నతరమాయెను.

ఉపమానములోని ముఖ్యాంశము ను విడిచిపెట్టి దానిలోని చిన్న చిన్న అంశములకు సొంత భావార్ధములు కొందరు చెప్పుదురు. అది ప్రమాద కరము. ఉదాహరణకు ఈ ఉపమానము లో కొమ్మలు, పక్షులు మొ॥గు వాటికి ప్రత్యేక భావముయేమీ లేదు. ఆరంభము చిన్నదైనా రాజ్యము యొక్క అభివృద్ధి గొప్పదనుటకు ఈ చిన్న సంగతులను గూర్చి ఉపమానములో చెప్పబడెను. వాటి యొక్క ప్రత్యేకత యేమీ లేదు.

యేసు మాటలను వినుచున్న వారందరు ఎరిగిన సందర్భములనే ఉపమానములలో ఆయన వాడెను. ఆయన మాటలను వినుచున్నవారందరు వాటినిబట్టి గొప్పగా లాభపడిరి. వాటిని సులభముగా గ్రహించుకొనగల్గిరి. ప్రకటన గ్రంథములోని అలంకార భాషయొక్క అర్థమును మొదటి శతాబ్ధపు క్రైస్తవులు మనకంటే బాగుగా గ్రహించుకొని యుండిరి.

ఈ ఉపమానములో చెప్పబడిన ఆవగింజను గూర్చి మనకు పెద్దగా అవగాహనలేదు. ఆ విత్తనములు లభించే ప్రదేశము, అది మొలకెత్తే ప్రదేశము నుండి మనము దూరముగా యున్నాము. అది పెరిగే అట్టి విత్తనము, మొక్కలు వున్నట్లు మనం గ్రహించుకోగలము.

బాగుగా పెరిగిన ఆవమొక్క 20 అడుగుల సైజువరకు యుండును. మన ప్రభువు చెప్పిన మొక్క ఒక తోటలో

నాటబడితే గొప్పగా పెరుగును. పరలోక రాజ్యము "ఒక మనుష్యుడు తీసికొనిపోయి తన తోటలో వేసిన ఆవగింజను పోలి యున్నదని" అందుకే ప్రభువు చెప్పెను (లూకా 13:19). ఈ ఆవమొక్క ఒక చెట్టువలె కనబడినను, ఒక వృక్షమున కుండ వలసిన కాండము బలము దానికి లేకపోవును. అది ఒక కాలము మట్టుకే బ్రదికి యుండును. పువ్వులు విత్తనములు రాగా అది వాడిపోవును.

ఆవగింజ అన్నిటికంటే చిన్న విత్తనము కాదని కొందరు చెబుతారు. కూరమొక్కలలో విత్తనము అన్నిటికంటె చిన్నదని కొందరు చెబుతారు. యేసుకూడ అట్లే దానిని గూర్చి చెప్పారు (మత్త 13:32). ఆవగింజ అను మాట యూదులలో ఒక సామెత వలె వాడుకలో యుండేది. ఆవగింజంత విశ్వాసమును గూర్చి ప్రభువు చెప్పారు (మత్తయి 17:20). తదుపరి ప్రభువు మాటలను వినుచున్న వారెరెగిన చిన్న విత్తనము ఆవగింజయే.

ఆవగింజకును దానిమొక్కకును సైజులో యున్న వ్యత్యాసమును ప్రభువు మాటలు వినుచున్న వారు బాగుగా ఎరిగియుండిరి. ఈమార్పు త్వరితముగా సంభవించునని కూడ వారెరెగి యుండిరి. అందువలన యేసు తాను స్థాపించుటకు వచ్చిన రాజ్యమును ఆవగింజతో పోల్చుట సరియే. ఆవగింజ, క్రీస్తు రాజ్యము కూడ ఆరంభములో స్వల్పము గానే కనబడెను. అది నాటబడి మొల కెత్తగా రెండు కూడ గొప్పగా అభివృద్ధి జెందెను. తదుపరి ఆరంభముకును, అభివృద్ధికిని యున్న వ్యత్యాసము చాల గంభీరముగా యుండెను.

**ముగింపు :**

అప్పటి కింకను స్థాపించబడక పోయినను యేసు తన రాజ్యాభివృద్ధిని ప్రవచనాత్మకముగా సజీవమైన ఒక దానితో పోల్చెను. క్రీస్తురాజ్యము (సంఘము) ఆరంభ దినమున మూడు వేలమంది దానితో చేర్చబడిరి (మత్తయి 16:18-19; అపో.కా. 2:41,47). తదుపరి కొన్నిదినముల తరువాత 5 వేలమంది చేర్చబడిరి (అపో.కా. 4:4). కాలము గడచుకొలది రాజ్యపౌరుల సంఖ్య బహుగా విస్తరించెను (అపో.కా. 6:1-20,7-8). ప్రతిదినము వారి సంఖ్య బహుగా విస్తరించెను (అపో.కా. 16:5).

రాజ్యము యొక్క అభివృద్ధి నేరుగా కనబడుచుండెను. దాని పైకి వచ్చిన హింస ఎక్కడి నుండి వచ్చినా (యూదులు, అన్యుల నుండి) క్రీస్తు రాజ్యాభివృద్ధిని ఆపుచేయ లేక పోయెను (అపో.కా. 8:1,4). క్రైస్తవులను బహుఘోరముగా హింసించిన ను దాని అభివృద్ధిని ఆటంకపరచుటలో విఫలమాయెను. హతసాక్షుల రక్తము

రాజ్యము యొక్క విత్తనమాయెను. కాన్‌స్టాంటిన్ చక్రవర్తి కాలములో రోమా సామ్రాజ్య విధానములు దాని అభివృద్ధిని ఆపుచేయలేకపోయినందున, క్రైస్తవ్యమునకు అనుకూలముగను, ప్రోత్సహించునట్లుగను తయారయ్యెను. క్రైస్తవ్యమును రోమా రాజ్యము తన లాభము కొరకు వాడు కొనునట్లు దాని విధానములో మార్పుజెందెను. హింసకంటే ఈరాజకీయ విధాన మార్పువలన దేవుని రాజ్య విస్తరణకు గొప్ప విఘాతము కలిగెను.

తీవ్ర ఒత్తిడిలో కూడ క్రీస్తు శిష్యులు తమ్మును తాము ఉపేక్షించుకొనుటలో రాజ్యము యొక్క విత్తనమైన దేవుని వాక్యములో గల శక్తి గొప్పగా ప్రస్ఫుటమాయెను (లూకా 8:11; రోమా 1:23). నాటుటలోను, నీరుపోయుటలోను, కోత కోయుటలోను మానవుని యొక్క ప్రమేయ ముండాలనునది దేవుని సంకల్పము (రోమా 10:13-17; కొరింథీ 3:6-9). ఎన్ని కష్టములొచ్చినా దేవుని రాజ్య విత్తనము నాటుట సాధ్యమే (మత్తయి 24:14; కొలస్స 1:13).

నిజముగా ప్రవక్త అలంకార రీతిగా చెప్పిన చిన్నరాయి భూతలమంత పెద్దదిగా తయారయ్యెను (దానియేలు 2:31-45). "కార్యములు అల్పములైయున్న కాలమును తృణీకరించినవాడెవడు? (జెకర్యా 4:10). ప్రభువు యొక్క గంభీరమైన సార్వజనిక రాజ్యము యొక్క పరిచయము బహుదీనముగా అగుపడును. 1) ఆయన బహుదీనునిగా జన్మించి పశువుల తొట్టెలో పరుండ బెట్టబడెను 2) ఆయన బాల్యదశ యూదులలో అల్పమైన గ్రామములో కొనసాగెను. 3) ఆయన రబ్బీగా ఎక్కడా తర్ఫీదు పొందలేదు 4) రాజులకుండ వలసిన భౌతిక సంపద యేసుకులేదు. 5) తానే ప్రభుత్వము వలన వధింపబడెను.

ఇట్టి సందర్భములలో దేవుడు సంకల్పించినది తప్ప మరియే ఉద్యమమైనను నాశనమగును. క్రీస్తు రాజ్య మేర్పడిన తరువాత అది యూదుల వలనను, ప్రభుత్వము వలనను తీవ్రమైన ప్రతిఘటనలను, హింసను ఎదుర్కొనెను. ఈ నూతన రాజ్యము యొక్క ముఖ్యులు, సభ్యులు కూడ చెరసాలలో బంధింపబడిరి, కొట్టబడిరి, చంపబడిరి. ఈ రాజ్యము విజయము సాధించి ప్రపంచ వ్యాప్తి జెంది, వేలకొలది సంవత్సరముల మట్టుకు నిలిచి యున్నదంటే అది మానవులకు కాదుగాని దేవుని శక్తికే గొప్ప నిదర్శనమై యున్నది. కొన్ని చోట్ల సంఘము చిన్నదిగా యున్నందున ప్రజలు దానికి వెలుపల యుండరాదు. అది చిన్నదేయని క్రీస్తుసంఘమును నిరాకరించువారు పెడద్రోవ పెట్టబడిన వారు.

ఆవగింజ యొక్క ఉపమానము ను ప్రభువు ఎందుకు చెప్పినట్లు? మొదటి నుండీ కూడ ప్రతివాడు యేసు బోధను అనుకరించువాడు కాదని శిష్యులు ఎరిగే యుందురు (మత్తయి 10:1-25). తిరస్కారము సంతోష దాయకము కాదు. దేవుని ప్రవక్తలు, వారి వర్తమానము కూడ తరుచు తిరస్క రించబడేది (రోమా 10:13- 21).

"అయినను అందరు సువార్తకు లోబడలేదు. ప్రభువా, మేము తెలియ జేసిన సమాచారము ఎవడు నమ్మెను? అని యెషయా చెప్పుచున్నాడు గదా?" (రోమా 10:16).

తదుపరి ఆయన సిలువ వేయ బడగానే యేసుక్రీస్తుయొక్క భూలోక సువార్త సంచారము అకస్మికముగా ఆగిపోయెను. యేసు తిరిగిలేచునని నమ్మలేక, భయాందోళనలలో శిష్యులు పారిపోయిరి (మార్కు 14:24,50). ప్రభువు తిరిగి లేచిన తరువాత కూడ శిష్యులు వారి పాత వృత్తికి తిరిగి వెళ్లిరి (యెహాను 21:3-14).

అపొస్తలులకు తరచు ప్రోత్సహ మవుసరమయ్యేది. వారి నిరుత్సాహముకు తోడుగా ప్రభువు చెప్పిన కొన్ని ఉపమాన ములు కూడ వారిని నిరుత్సాహపరచినవి. విత్తువాని ఉపమానములలో నాలుగవ వంతు మాత్రమే ఫలితమిచ్చునని వారు విన్నారు. గురుగులను గూర్చిన ఉపమాన ములలో నిలకడగా ఉన్నవారు ఎదుర్కొనే ఆటంకములను గూర్చి తెలిసికొన్నారు. వారు నిరుత్సాహపడకుండునట్లు ప్రభువు ఆవగింజను గూర్చియు, పులిపిండిని గూర్చియునైన ఉపమానములు చెప్పారు.

ఆవగింజను గూర్చిన ఉపమానము చిన్నదే అయినను ప్రతితరములోను యున్న దేవుని రాజ్యసంబంధుల గొప్ప భావముతో కూడినదై యున్నది.

-లూయిస్ రష్‌మోర్

## శరీరము ద్వారా సాతానుడు జయించును
## (Satan conquers through the Flesh)

పరమందొక దేవుడున్నారు. ఆయన ఎట్లుంటారు ? ఆయన సర్వశక్తి మంతుడు, కరుణగలవాడు, దయగల వాడు. అట్లయితే ఈలోకంలో అంత దుష్టత్వం ఎందుకు వున్నదని కొందరడు గుదురు. పాపమునకంతకు కర్తయైన అపవాది నుండి దుష్టత్వము కలుగునని మనం తెలిసికొన్నాము. సాతానును మనం ఎట్లు ఎదిరించవచ్చునో, దాని నెట్లు జయించ గలమో ఇప్పుడు తెలిసికొందము. మానవుని యొక్క తత్వాన్ని, దుష్టత్వాన్ని పఠించుట ద్వారా దీనిని బాగుగా గ్రహించుకో గలము.

**భౌతిక ప్రపంచము, సృష్టములు దేవుని చిత్తము ప్రకారమున్నవి :**

అత్యంత పరిపూర్ణుడైన దేవుడు తనతో సమానపరిపూర్ణతగల ప్రపంచమును సృజింపలేదు. అట్లయిన అట్టిలోకము అనంతమైనదై ఆయననుండి ప్రత్యేకమైనదిగా యుండకపోవును. పరిపూర్ణతకు లోపించి సృజింపబడినది ఏదైనను పరిమితి గలది. అంటే హద్దులు గలదియని అర్ధము. దేవుడు అపరిమితుడు. భౌతికలోకము దేవుని నుండి వేరుగా యున్నను ఆయనపై ఆధారపడియున్నది గనుక దానిని దేవుడు తన ఆధీనములో యుంచుకొని యున్నారు. అందు వలన ఈ విశ్వాన్ని దేవుడు తన శక్తినిబట్టి పాలించుచున్నారు. జంతువులు ఈలోకములో యున్నా వాటికి స్వేచ్ఛలేదు. ప్రతి జంతువుకు దేవుడు ఒక నిర్ధిష్టతత్వము నిచ్చి ప్రతి దానికి ఇంగిత జ్ఞానము నిచ్చారు. అందు వలన ప్రతిజాతి యొక్క సంతతి దాని ఆదిమ తత్వములో మార్పు లేకుండా జీవించును, చలించును, భుజించును, ఉత్పత్తియగును.

**మానవునికి దేవుడు ఎంపిక శక్తినిచ్చారు:**

దేవుడు మానవుని చేసినప్పుడు, ఆయన దైవత్వములో కొంతభాగాన్ని మానవునిలో యుంచారు. మానవుడు యోచించుటకు, ఆలోచించుటకు సంకల్పించుటకు, ఎంపిక చేసికొనుటకు శక్తినిచ్చారు. దేవుడు తన పరిపూర్ణతను మానవునిపై రుద్దలేదు. అట్లు చేసి యుంటే మానవుడు దేవుని నుండి వేరుగా కనబడక పోవును. మానవుడు ఒక ప్రత్యేక వ్యక్తిగా యుండాలని దేవుడు కోరుకొన్నారు. ఈస్వేచ్ఛను బట్టి మానవుడు తనకుగా తాను యోచించుటకు, చలించుటకు, సంకల్పించుటకు సామర్థ్యము గల వాడాయెను.

అందువలన ఏవిషయంలోనైనా మానవుడు ఫలానాది చేయవచ్చునని గాని, చేయకూడదని గాని నిశ్చయించుకోగలడు. అతడు నడవడానికి, లేక నిద్రపోడానికి ఎంచుకోవచ్చును. ఏదైనా చేయడానికి లేక చేయకపోడానికి నిశ్చయించు కొనవచ్చును. మానవుడు మంచిని ఎంచుకొని మంచినే చేయాలని దేడువు కాంక్షించును. అవును అతి శ్రేష్టమైన దానినే ఎంచుకోవాలని ఆయన కోరును. అయితే మానవుడు పరిమితిని బట్టి శ్రేష్టమైన దానికి లోపించియున్న దానిని ఎంచుకొనును. తనకు సామర్థ్యమున్నను మానవుడు అతి శ్రేష్టమైన మంచిని ఎంచుకొనుటకు విఫలుడైనప్పుడు, అతడు పరిపూర్ణతకులోపించి పనిచేయును. అతడు శ్రేష్టతకు స్పందించి శ్రేష్టమునే ఎంచుకొంటే అతడు పరిపూర్ణ ఆదర్శము యొక్క పరిమాణమునకు సరిపడును. పరిపూర్ణతకు లోపించిన వాడైతే అతడు విఫలుడయ్యాడని

యర్ధము. అంటే అతడుండవలసిన రీతిగా యుండక, పని చేయవలసిన రీతిగా పనిచేయలేదని యర్ధము. ఈ నిర్లిప్తత, పాపము వలన కలిసి వచ్చేది యేదీ లేదు. పాపమంతా పనికిరానిదే. అందువలన ఏదో ఒక విధంగా ఎంచుకోనే సామర్ధ్యము గల వానిగ దేవుడు మానవుని చేసినప్పుడు, మానవుడు పాపము చేయ శక్తిగల వానిగా కూడ చేసారు. యిది స్వేచ్ఛ యొక్క తప్పించుకోలేని పరిణామము. మానవు డేమి చేయాలో లేకఎట్లుండాలో దేవుడు అతనికి తన వాక్యము ద్వారా తెలియ జేసారు. దేవుడు చెప్పినట్లుండుట, ఆయన చెప్పినట్లు చేయుట అంటే ఆయనకు విధేయత చూపుచున్నట్లు అగును. ఆయన చెప్పినట్లుండక, చేయకపోతే ఆయనకు అవిధేయత చూపుచున్నట్లుగుపడును.

**మానవుని స్వేచ్ఛ వలన అవిధేయత సాధ్యమాయెను :**

మానవునికీయబడిన స్వేచ్ఛలో అతడు అవిధేయుడయ్యే అవకాశము న్నందున సాతానుకు దానిలో ఒక తరుణం దొరికెను. ఏదెనువనంలో దేవుడుంచిన వృక్షము కండ్లకు ఇంపుకుగాను, రమ్య మైనదిగాను ఆదాము హవ్వలకు మంచి చెడ్డల యొక్క తెలివి నిచ్చునదిగాను యుండెను. సాతాను హవ్వతో మాట్లాడిన పుడు ఆవృక్షఫలము యొక్క ఈమంచి లక్షణములను ప్రశ్నించనేలేదు. దేవుడు చెప్పిన దానిని గూర్చియే అతడు హవ్వను ప్రశ్నించాడు: "ఈతోటచెట్లలో దేనిఫలము నైనను మీరు తినకూడదని దేవుడు చెప్పెనా?" యని అతడు ప్రశ్నించాడు (ఆది.కా. 3:1). యిది చాల అమాయక మైన ప్రశ్నగా కనబడుచున్నను, అప్రశ్న ద్వారా దేవుని ఆజ్ఞ యొక్క పరిశోధనను, దాని పరిమితులను, లాభ నష్టములను గూర్చిన పరిశోధనను అతడారంభింప జేసెను ఈ మోస పూరితమైన భావము లను గూర్చి హవ్వ యేమీ గుర్తించ లేదు. గనుక ఈతోట చెట్లఫలలములను మేము తినవచ్చును, గాని తోటమధ్యనున్న ఫలమును తినరాదని దేవుడు చెప్పెనని వానితో చెప్పెను (ఆది.కా. 3:3). దాని తిను దినమున మేము నిశ్చయముగా చచ్చెదమని హవ్వ చెప్పెను.

హవ్వయిచ్చిన జవాబునుబట్టి ఆమె తడబడుచున్నదని సాతాను గమనించాడు. సరిగదా భయమువలన ఆమె వెనుకాడు చున్నదని గమనించాడు. ఆభయాన్ని గనుక వాడు తొలగించితే హవ్వ వాని వలలో పడునని సాతాను గమనించాడు. యదార్ధమైన విధేయత భయము వలన గాక ప్రేమ వలన కలుగునని అతడెరు గును.

అప్పుడు సాతాను హవ్వ యొక్క గొప్పవిమోచకుడుగా నటించాడు. తన భయాన్ని తొలగించే గొప్ప హీరోగా నటిం

వాడు. గనుక దేవుని మాటను నిరాకరించి "మీరు చావనే చావరు" అని చెప్పేసాడు (ఆది.కా. 3:4). అందుకే వాడొకగొప్ప అబద్ధికుడు. అతడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడు (యోహాను 8:44).

**అవిధేయులు సాతాను రాజ్యములో ప్రవేశిస్తారు :**

ఆదాము హవ్వలు నిషేదింపబడిన ఫలమును తిన్నారు. అట్లుచేయుటలో వారు దేవునికి అవిధేయులగుట మాత్రమే గాక మరణ ద్వారములను తమ పైకిని, లోకమున కంతటికిని తెరిచారు. పాపము వలన వచ్చు జీతము మరణమని రోమా 6:23 చెప్పుచున్నది. శరీరమునుండి ఆత్మ వేరైపోయినప్పుడు భౌతిక మరణము సంభవించును (యాకోబు 2:26). శరీరము, ఆత్మకూడ దేవుని నుండి వేరై పోవుట వలన ఆత్మీయమరణము సంభవించును (ఎఫెసీ 2:12). పాపము చేయువారు సాతాను రాజ్యములో ప్రవేశింతురు, అతడు వారికి దేవుడగును, వారతనికి దాసులగుదురు (రోమా 6:16). చివరకు మరణము సంభవించును (యాకోబు 1:13-15). మరణము మన శత్రువు (1కొరింథీ 15:25).

**అపవాది క్రియలు లయము చేయడానికి క్రీస్తువచ్చెను :**

అపవాదిని వాని క్రియలను లయము చేయడానికి యేసు వచ్చెను (హెబ్రీ2:19). క్రీస్తు యొక్క జీవితం ఆది నుండి అంతము వరకు అపవాదితో చేసిన గొప్ప పోరాటమే. క్రీస్తుబాప్తిస్మము పొందగానే అపవాదితో పోరాటము నిమిత్తము అరణ్యములోనికి కొనిపోబడెను (మత్తయి 4:1).

**సాతానుతో క్రీస్తుపోరాటము ఆయన పరిచర్యలో భాగము :**

అపవాదిని వాని క్రియలను లయముచేయుటకు క్రీస్తువచ్చెను గనుక, తన పరిచర్యలో మొదటి భాగముగా ఆయన అపవాదితో పోరాడాలని దేవుడు కోరెను, ఆయనకు విజయము తథ్యము, ఈపోరాటము మొదటి స్త్రీ పురుషులు ఎదుర్కొనిన శోధనకు భిన్నమైన పరిస్థితులలో జరిగెను. క్రీస్తు ఒక వనములో గాక అరణ్యములో యుండెను. ఆయన నలుబది దివారాత్రులు వుపవాసముండెను గనుక ఆశోధన క్లిష్ట పరిస్థితులలో, ఆయన శరీరరీత్యా బలహీనుహీనుడుగా యున్నపుడు జరిగెను. తన విజయమునకు అనుకూల పరిస్థితుల కొరకు సాతాను కనిపెట్టి యుండెను. అతడు మొదటి మానవుడైన ఆదామును జయించాడు గనుక రెండవ ఆదామును కూడ జయించుటకు కంకణము కట్టుకొనెను. అదిసాధ్యమయితే దేవునిపై వాడు చేసిన తిరుగుబాటు విజయవంతమగును.

గర్జించు సింహమువలె వాడు దండెత్తెను. ప్రపంచములో అతి భయంకర పోరాటము మొదలిడెను. దానికి కొన్నిరోజుల ముందు యొర్దాను నదిలో క్రీస్తు బాప్తిస్మము పొందగా "ఈయన నాప్రియ కుమారుడు ఈయనయందు నేనానందించుచున్నానని" పరమునుండి దేవుడు పలికెను (మత్తయి 3:17).

**సాతానుచే క్రీస్తు శోధించబడెను:**

క్రీస్తుయొక్క మనస్సులో యున్న వాస్తవముతో సాతాను తన పోరాటమును "నీవు దేవుని కుమారుడవైతే" అను పదములతో ప్రారంభించెను (మత్తయి 4:3). ఈవాస్తవాన్ని కాదనుటకు సాతాను ప్రయత్నించలేదు. అది యదార్థమని వాడెరుగును. దానిని బట్టి వాడు వణకెను. గనుక భరింపరాని ఆకలితో యేసు ఉండేవరకు కనిపెట్టి అలనాడు హవ్వను శోధించిన రీతిగనే క్రీస్తుపై దండెత్తెను. ఏదెనులో ఆఫలముకన్నులకు అందమైనదియు, ఆహారమునకు మంచిదియు, వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుటవలన హవ్వ దానిని తినెను. యిది సాతాను యొక్క లక్షణము. శరీరాశల ద్వారా అతడు మనలను శోధించును. క్రీస్తుకు ఇయ్యడానికి వానికి అక్కడ ఏఫలములు లేవు గాని రాళ్లున్నాయి. క్రీస్తు వాటిని రొట్టెలుగా మార్చగలడని వాడెరుగును.

**క్రీస్తువానికి లోబడాలని సాతాను కోరెను :**

ఆకలిగొనిన జనసమూహములకు క్రీస్తు ఆహారమిచ్చెను. గనుక సాతాను యొక్క సలహా ఆమోద యోగ్యమైనదే. ఆకలిగొన్న వానికి ఆహారము ! క్రీస్తు ద్వార సాతాను అద్భుతము జరిగించాలని కోరుకొన్నాడు. క్రీస్తులో స్వకీయ శరీరాశను రేకెత్తించగోరాడు; క్రీస్తువానికి లోబడాలని కోరాడు. అయితే ఆయనకు శరీర పోషణ అత్యవసరమైనను క్రీస్తు శరీరాశలకంటే ఆత్మకు ఎక్కువ ప్రాధాన్యతయిస్తు,"మనుష్యుడు రొట్టెవలన మాత్రమే జీవించడు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును" అని చెప్పెను (మత్త 4:4). అదే ఆత్మకు ఆహారము. శరీరాన్ని పోషించుకొనుటకంటే దేవుని మాటకు లోబడుట ముఖ్యము, మొదటి శోధనలో క్రీస్తు నిత్య సూత్రములకంటే ఈలోకసంగతలను కాంక్షించునట్లు చేయాలని సాతాను ప్రయత్నించాడు. గాని శరీరకోరికలకంటే క్రీస్తు దేవుని ఎక్కువ ప్రేమించారు. లిఖితమైన దేవుని వాక్యము నీతిమంతులకు ఆహారముగాని అపవాదికి అది విషము. అందు వలన క్రీస్తు యొక్క జవాబు సాతాను యొక్క మొదటి శోధనకు అంతము పలికెను. తన మొదటి జవాబుతోనే ఆయన సాతానుకు గొప్ప అఘాతము కలిగించెను, కోలుకోలేని గాయము కలిగించెను ఏలయనగా దేవుని వాక్యము రెండంచులు

గల ఎటువంటి ఖడ్గముకంటెను వాడి యైనది (హెబ్రీ 4:12).

– ఓటీస్ గేట్స్వుడ్

## "దేవునికి ప్రీతికరమైన సేవ చేయుడి" (హెబ్రీ 12:18-29)

యూదులుగా జన్మించిన క్రైస్తవులను ప్రోత్సహించుటకు హెబ్రీ గ్రంథం వ్రాయబడింది. మోషేకంటే దేవదూతల కంటే యేసు ప్రభువు ఉన్నతుడు గనుక మనం ఇపుడు ఇక పాతనిబంధనకు బద్ధులంకాము "స్పృశించి తెలిసికొన దగినట్టియు మండుచున్నట్టియు కొండకును,అగ్నికిని, కారుమేఘమునకును, గాఢాంధకారమునకును, తూఫానుకును, బూరధ్వనికిని, మాటల ధ్వనికిని మీరు వచ్చియుండ లేదు. ఒక జంతువైనను ఆకొండను తాకినయెడల రాళ్లతో కొట్టబడవలెనని ఆజ్ఞాపించిన మాటకు వారు తాళలేక, ఆధ్వని వినిన వారు మరి ఏమాటయు తమతో చెప్ప వలదని బతిమాలుకొనిరి మరియు ఆ దర్శనమెంతో భయంకరముగా ఉన్నందున మోషే నేను మిక్కిలి భయపడి వణకుచున్నానెను" (హెబ్రీ 12:18–21). సీనాయి పర్వతం మీద పాతనిబంధనను మోషేకు ఇచ్చినప్పటి సంగతులను గూర్చి రచయిత మాట్లాడుతున్నాడు. నిర్గమ 20:19 ; ద్వితి 4:11.

ఇపుడయితే క్రైస్తవులమయిన మనము సీనాయిను కొండకు వచ్చియున్నాము. (హెబ్రీ 12:22). దేవుని ఆలయం నిర్మింపబడిన యెరుషలేములో ఈసీయోను పర్వతం ఉంది. దావీదు రాజు యెబూసీ యులనుండి ఈసీయోనును తీసికొని దావీదు పట్టణంగా నిర్మించాడు. అతడు గిబియానుండి దేవుని నిబంధన మందసమును తీసికొని వచ్చి యెరూషలేములో ఉంచాడు. సొలొమోను యెరూషలేములో గొప్పమందిరమును నిర్మించు వరకు మందసము గుడారము మధ్యనుంచబడెను. (2 సమూ 5:6–9). యెషయా ప్రవక్త ఇలాప్రవచించాడు "అంత్యదినములలో పర్వతములపైన యెహెూవా మందిర పర్వతము పర్వత శిఖరమున కొండలకంటే ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆకాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేములో నుండి యెహోవా వాక్కు బయలువెళ్లును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము

వెళ్లుదము రండి.... (యెషయా 2:2-3 మీకా 4:1-2). దేవుని మంది రములో, అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులు నీకు వ్రాయుచున్నాను. ఆసంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది. (1 తిమోతి 3:15, 1పేతురు 2:5). సీయోను దేవుని ఇల్లు, దేవుని ఇల్లు జీవముగల దేవుని సంఘము. క్రీ॥శ 33లో యెషయా ప్రవక్త యొక్క ప్రవచనము పెంతెకోస్తుదినాన యెరూషలేములో నెరవేరింది (అపొ.కా. 2 వ అద్యా). యెరూషలేములో (సీయోనులో) సంఘము స్థాపింపబడింది సమస్త జనులు ప్రవాహంగా వస్తున్నారు. క్రొత్తనిబంధన ఆజ్ఞలు., దేవుని వాక్యము అపొస్తలులద్వారా యెరూషలేము నుండి ప్రకటించబడింది (అపొ॥కా2: 42;8:1).

సంఘము అనేది జీవముగల దేవుని పట్టణం. దేవుడు తన ప్రజలకు ఒక పట్టణము సిద్ధపరచనై యున్నాడని అబ్రహాము ఎరుగును (హెబ్రీ 11:16; 8: 56; ఎఫెసీ 2:18). అతని దర్శనములో యోహానుకు ఒక దూత ఈలాగు చెప్పెను. యెరూషలేము అను పరిశుద్ధపట్టణము దేవుని మహిమగలదై పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుట నాకు చూపెను. ......... గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడిన వారే దానిలో ప్రవేశింతురుగాని నిషిద్ధమైనదేదైనను అసహ్య మైనదానిని, అబద్ధమైన దానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు" ప్రకటన (21:1-27).

దేవదూతలు సేవకులైన ఆత్మలు (హెబ్రీ 1:14, లూకా 2:13; ఆది 28:12, కీర్త 103:20, 34:2,148:2, దానియేలు 7:10; ప్రకటన 5:11; మత్తయి 26:53, మార్కు 1:13). వారు నిత్యము స్తుతిచేస్తారు (యెష 6:24; ప్రక 19:1-3) ఆయన రెండవ రాకడలో వారు యేసు ప్రభువుతో వస్తారు. (మత్త 25:31, 1కొరింథీ15:52). క్రైస్తవులందరితో పాటు లెక్కింపశక్యము కానంత మంది దేవ దూతలు కూడ దేవునికి స్తుతి గానము పాడుతారు.

సంఘము అనేది పరలోకమందు పేర్లు వ్రాయబడిన ప్రథమ సంతతియొక్క కూడిక. ప్రథమ సంతతి ఎవరు? దేవుడు ఫరోతో అన్నారు "......... ఇశ్రాయేలు నా కుమారుడు, నాజ్యేష్టపుత్రుడు" అని (నిర్గమ 4:22). యేసుక్రీస్తు రక్తములో ఎవరైతే తమ పాపములను కడుగుకున్నారో వారే దేవుని పిల్లలు. "బాహ్యమునకు యూదుడైనవాడు యూదుడు కాదు, శరీరమందు బాహ్యమైనసున్నతి సున్నతి కాదు. అయితే అంతరంగ మందు

యూదుడైనవాడే యూదుడు. మరియు సున్నతి హృదయసంబంధమైనదై ఆత్మయందు జరుగునదేగాని అక్షరము వలన కలుగునది కాదు. అట్టివానికి మెప్పు మనుష్యుల వలన కలుగదు. దేవుని వలననే కలుగును. (రోమా 2:28,29). క్రైస్తవులు దేవుని ప్రియమైన కుమారులు, కుమార్తెలునైన నూతన ఇశ్రాయేలీయులు. దేవుడు మోషేతో ఇలా అన్నారు " ఇశ్రాయేలీయులలోనుండి లేవీయులను నావశము చేసికొని యున్నాను. ప్రతి తొలిచూలియు నాది. గనుక లేవీయులు నావారైయుందురు, ఐగుప్తుదేశములో నేను ప్రతి తొలిచూలును సంహరించిననాడు వారిని నాకొరకు ప్రతిష్టించుకొంటిని వారునావారై యుందురు. నేనే యెహోవాను" (సంఖ్యా 3:12,13). ప్రత్యక్షగుడారములోను తరువాత దేవాలయములోను దేవునికి సేవచేయుటకు ఏర్పరచుకొనబడిన గోత్రపు వారు లేవీయులు. క్రైస్తవులయిన మనలను ప్రభువైన దేవుడు రాజులైన యాజకులుగా ఏర్పరుచుకొన్నారు. పేతురు వ్రాస్తున్నారు " దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1పేతురు 2:9). అని పరలోక మందు పేరులు వ్రాయబడిన జ్యేష్టసంతానము క్రైస్తవులు. (లూకా 10:20, ఫిలిప్పీ 4 :3 ప్రక 3:5; 20:12).

సమస్తదేశములకు న్యాయాధిపతి యైనవానిని సంఘము ఘనపరుస్తుంది. దేవుడు సొదొమ-గొమొఱ్ఱాలను నాశనం చేయాలను కొన్నపుడు అపట్టణంలోని నీతిమంతుల కొరకు అబ్రహాము దేవుని యెదుట మొఱ్ఱపెట్టుకున్నాడు. "సర్వ లోకమునకు తీర్పుతీర్చువాడు న్యాయము చేయడా? (ఆది 18:25). "భూలోక న్యాయాధిపతి లెమ్ము, గర్విష్టులకు ప్రతి ఫలమిమ్ము అని కీర్తనాకారుడు ప్రార్థి స్తున్నారు. "ఇక మీదటనాకొరకు నీతికిరీటముంచబడి యున్నది. ఆదిన మందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు ఆదినాకును నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారందరికిని అనుగ్రహించును". (2తిమోతి 4:8) అని తన జీవిత చివరి దశలో అంటున్నాడు.

ప్రభువునందు నిద్రించిన వారు లేదా పరిపూర్ణులయినవారితో కలిసి క్రైస్తవులు దేవుని స్తుతిస్తారు. అబ్రహాము రొమ్మున అను కొని (లూకా16:19- 31). ఆదరణ పొందుతున్న వారి ఆత్మలు, క్రీస్తు ప్రభువు భూమికి తిరిగి వచ్చినపుడు ఆయనతో కూడా ఉంటారు (1థెస్స 4:16,3:13). ప్రభువు తన వేవేల పరిశు ద్ధుల పరివారముతో వచ్చును" (యూదా 14). గొప్ప పరిశుద్ధుల సమూహము ప్రభువును,గొఱ్ఱెపిల్లను "సింహాసనాసీను డైన మాదేవునికిని గొఱ్ఱెపిల్లకును మా రక్షణకై స్తోత్రమని స్తుతిస్తారు. (ప్రక 7,9,10,15:3,4,19:1,2).

క్రొత్తనిబంధనకు మధ్యవర్తి యేసుక్రీస్తు ప్రభువు సర్వశక్తుడైన దేవుని ప్రియమైన కుమారుడు సర్వమానవ పాపమును భరించుటకై ఈలోకమునకు మానవ రూపంలో వచ్చారు, "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయ ధనముగా తన్నుతానే సమర్పించుకొనెను. దీనిని గూర్చిన సాక్ష్యము యుక్తకాలముల యందు ఇయ్యబడును (1తిమోతి 2:5-6) "ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున పిలువబడిన వారు నిత్య మైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానము పొందినందున ఆయన క్రొత్తనిబంధనకు మధ్యవర్తియై యున్నాడు (హెబ్రీ 9:15). నీతమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు. (1 యోహాను 2:2). యేసుక్రీస్తుప్రభువు మన ప్రధాన యాజకుడు. పరలోక ప్రభువు మానవజాతికి మధ్యవర్తి.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా ఎవరైతే తమ పాపములను కడుగుకొంటున్నారో వారిని ప్రభువు సంఘమునకు చేరుస్తున్నారు. నీతి యగు నట్లు క్రీస్తుప్రభువు మనపాపములనన్నీ టిని కడుగుతున్నారు. హేబెలు తన సోదరుని ద్వారా చంపబడినపుడు ఆతని రక్తము నేలనుండి దేవునికి మొరపెట్టింది. (ఆది 4:9). హేబెలు రక్తముకు ఎవరి పాపములను కడుగ గలశక్తి లేదు గనుక యేసుక్రీస్తు ప్రభువు రక్తము హేబెలు రక్తము కంటే శ్రేష్టమైనది.

రచయిత పాతనిబంధన కంటే నూతన నిబంధన యొక్క ఆధిక్యతను తెలియచేయుచున్నాడు. దేవుని సంఘము లో దేవుని రాజ్యములో ఉండే ఆశీర్వా దము అనేది కదల్చబడదు.

దేవుని రాజ్యములో ఉన్న ఆశీర్వా దములన్నీటిని అనుభవించగల ఆధిక్యత గలవారం గనుక మనము దేవునిని భయ భక్తులతో, గౌరవంతో అంగీకారమునైన రీతిగా సేవించువలెను. లేనియెడల మనము శిక్షింపబడుదుము. ఎందుకనగా "మన దేవుడు దహించు అగ్నియై యున్నారు. " (హెబ్రీ 12:18-29).

- కవిత గూటం

## ఆయన రాజ్యమును మొదట వెదకాలి

## ( The Kingdom must be First )

యేసుప్రభువు గొప్ప ప్రసంగము చేయుచు, "మీరు ఆయన రాజ్యమును

నీతిని మొదట వెదకుడి; అప్పుడ వన్నియు మీకనుగ్రహింపబడును" అని చెప్పారు (మత్తయి 6:33). ఆరోజులలోను, ఈరోజులలోను కూడ యిది ఎక్కువ నిర్లక్ష్యము చేయబడుచున్న ఆజ్ఞయై యున్నది. అయితే మన జీవితంలో దేవుని రాజ్యము అత్యంత ప్రాధాన్యమైనదై యుండాలి.

రాజ్యము యొక్క ప్రాముఖ్యతను గూర్చి బోధించుచు మత్తయి సువార్త 13వ అధ్యాయములో యేసు అనేక ఉపమానములు వినియోగించారు. ఈ బోధ మధ్యలో దాని భావమును గూర్చి తన శిష్యులకు చెప్పారు (మత్తయి 13:36-43). గురుగులను గూర్చి చెప్పిన ఉపమానములో దానిలోని భాగములను వివరించారు. గోదుమలు గురుగులు విభిన్నములు. క్రొత్తనిబంధన యంతటటిలో కలిసి ఈ ఉపమానము నిత్య ప్రాముఖ్యతను కలిగి యున్న ఒకే ఒక్క సంస్థయున్నది యని బోధించుచున్నది. గనుక దేవునికి ప్రీతికరముగా యుండగోరువాని హృదయములో దానికి మాత్రమే స్థానము ఉండాలి. మొట్ట మొదట ఆయన రాజ్యము మన హృదయాల్లో ఉండాలి.

క్రీ॥పూర్వము 600 సం॥లో 18 సంవత్సరముల వయస్సుగల దానియేలు యూదా జనంగముతో బబునులో బానిసత్వములో యుండెను. అతడు రాజు వంశీయుడు. దేవుని చేత అనుగ్రహింపబడిన రాజ్యమును సకల శాస్త్ర ప్రవీణతయు కలిగి యుండుటయే గాక దానియేలు సకల విధములైన దర్శనములకు స్వప్నములకు భావము చెప్పె జ్ఞానము కలిగియుండెను (దానియేలు 1:17). దానియేలు గ్రంథము రెండవ అధ్యాయములో నాలుగు భూసామ్రాజ్యములు వచ్చి పోవుటను గూర్చి అతడు ప్రవచించెను. అవి బబులోను సామ్రాజ్యము, మాదీయ పారసీక సామ్రాజ్యము, గ్రీకు సామ్రాజ్యము, రోమా సామ్రాజ్యము అనునవి. ఆనాలుగవ రాజులకాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును, దాని కెన్నటికి నాశనము కలుగదు అని అతడు ప్రవచించెను (దానియే 2:44). అదినాశనములేనిది. అపజయము నొందనిది. నిత్యము వుండునట్టిది !

అయితే దానియేలు చెప్పిన రాజ్యముయేది? దానిని గూర్చి మత్తయి 16:13- 19లో చెప్పబడినది. అక్కడ రాజ్యము -సంఘము అను పదములు సరిసమానముగా యేసు ఉపయోగించెను. ఒకడు రాజ్యములో ప్రవేశించుటకు యేమి చేయాలో సంఘములో ప్రవేశించుటకు అదే చేయవలెను. సంఘములో యున్నవారు ఎట్లు రక్షింపబడుదురో, రాజ్యములో ప్రవేశించుటకు యేమి చేయాలో సంఘములో ప్రవేశించుటకు

అదే చేయవలెను. సంఘములో యున్నవారే ఎట్లు రక్షింపబడుదురో, రాజ్యములో యున్న వారు అట్లే రక్షింపబడుదురు. అందువలన రాజ్యము క్రీస్తు రక్తముచే కొనబడిన సంస్థయై యున్నది (అపొ.కా. 20:28). అది క్రీస్తు యొక్క ప్రశస్థశరీరము (ఎఫెసీ 1:22-23), దేవుని యొక్క కుటుంబము (1తిమో 5:1-2). సరియైన ఫలములు ఫలించు ద్రాక్ష తీగయై యున్నది (యోహాను 15:1-4).

సంఘము రాజ్యమై యున్నందున దానికొక ప్రత్యేకమైన రాజు ఉన్నాడు (క్రీస్తు), ప్రత్యేకమైన భూభాగమున్నది (సంఘము- విశ్వవ్యాప్తము), ప్రత్యే పౌరులు న్నారు (క్రైస్తవులు) ప్రత్యేక రాజ్యాంగము (క్రొత్తనిబంధన) యున్నది. రాజ్యము సామాన్యమైనది కాదు. భూసంబంధమైనది కాదు. క్రైస్తవుడైన వాడు సంఘముతో తన కేమి పనిలేదని చెబితే, రాజ్యము యొక్క ప్రాముఖ్య తను ఎరిగినవాడు కాదు.

**అదిక్రీస్తుది గనుక ప్రాముఖ్యమైనది :**

రాజ్యము క్రీస్తుకు చెందుతాది (అపొ.కా. 20:28). అది దైవికమైన పరలోక రాజ్యము (యోహాను 18:36). అది ఈ లోకములో యున్నది గాని దాని అధికార మంతయు పరలోకములో యున్నది. అందువలననే క్రైస్తవుని జీవితంలో అది మొట్ట మొదటి యుండాలి.

నీవెరుగని వాడెవడైన నీవు అనుసరిం చుటకు కొన్ని నియమములనిచ్చి యుండిన యెడల, వాటిని బహుశనీవు మన స్కరించి యుండకపోవచ్చును. నీపొరుగువాడు వాటిని యిస్తే వాటిభావం నీకు కొంత యుండ వచ్చును. వాటినే నీ భార్యయిస్తే జాగ్రత్తగా ఆలోచిస్తావు. అయితే ప్రభుత్వ ఉద్యోగిగాని, పోలీసు అధికారిగాని వాటిని యిస్తే, అనుసరిం చక పోవుట వలన కలుగు పర్యవ సానము బట్టి వాటికి లోబడుదువు, క్రీస్తుయొక్క సంఘములో యున్నవారు అనుసరిం పదగిన సూత్రములను ఏమానవుడు ఇయ్యలేదు. రాజ్యము క్రీస్తుకే చెందును. ఆయన తన పవిత్రరక్తము వలన మానవుని రక్షిం చారు. గనుక అతని జీవితంలో ఆయన సంఘమైన రాజ్యము మొదట యుండాలి.

**అదిస్థాపించబడిన కారణములను బట్టి ప్రాముఖ్యమైనది :**

నశించకుండా రక్షింపబడి సురక్షితమైన స్థావరములో యుండ గోరువారందరికి దేవుడు సంఘమును సంకల్పించారు (యోహాను 3:5). ఈలోక పొలములో ఉన్న ఏకైక మంచి విత్తనములు రాజ్యనివాసులు. రాజ్య ములో లేనివాడు నిస్సారమైన, నిష్ఫ లమైన విత్తనము. వ్యక్తిగత రక్షణను కోరువాని క్షేమార్థము దేవుడు తన రాజ్యమును స్థాపించెను.

రక్షింపబడిన వారు యేసు యొక్క సువార్తను ప్రకటించాలి. అది

రక్షణసువార్త. పాపమునుండి రక్షింపబడిన వాడు స్వార్థపరుడై ఆరక్షణను తన యొద్దనే ఉంచుకొన రాదు. యేసుకు పని వారు అవుసరము (లూకా10:2). ఆయన శిష్యులు సర్వ లోకమునకు సువార్తబోధించాలని ఆయన ఆజ్ఞాపించారు (మార్కు 16: 15).

గాయపరచబడిన వానికి వైద్య శాలగా దేవుడు సంఘమును సంకల్పించారు (యాకోబు 1:27; గలతీ 6:10). సంఘము సాంఘిక పరిచర్యచేయు ఒక సంస్థ కాదు. గాని ఆపదలలో యున్న వారికి అది సహాయము చేయును. ఆపదలలో యున్న వారినిచూచియు సహాయము చేయకపోతే అది క్రియలులేని విశ్వాసమగును (యాకోబు 2:14-18).

దేవుని ఘన పరచుటకు గాను దేవుడు రాజ్యమును స్థాపించారు. (ఎఫెసీ 3:21). సంఘము దేవుని చట్టములను నెరవేర్చుచు దాని ప్రయోజనమును పూర్ణము చేసిన యెడల దేవుడు ఘన పరచబడును.

**సంఘము యొక్క గమ్యమును బట్టి అది ముఖ్యమైనది :**

క్రీస్తుమరల వచ్చినప్పుడు ఆయన రాజ్యమును తండ్రియైన దేవుని కప్ప గించును. అప్పుడు అంతము వచ్చును అని పౌలు తెలియజేసాడు (1కొరింథీ 15:24). మనము బ్రదికి యుండగా రాజుకొరకు పనిచేయాలి. ప్రతిక్రైస్తవుడు క్రీస్తువలె "పగలున్నంతవరకు నన్ను పంపిన వాని క్రియలు మనము చేయుచుండవలెను; రాత్రివచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయ లేడు" అని చెప్పగలగాలి (యోహాను 9:4). భూమిపైనున్న ప్రతి వ్యక్తికి ఒక జీవితము, కొన్ని తలాంతులు ఇయ్యబడ్డాయి. ఒకని జీవితం అంతమయ్యేసరికి అతడు పనిచేసేటైమ్ ముగియును. గాని పునరుత్థాన దిన మొకటి వచ్చును (యోహాను 5:28-29). అప్పుడు అందరు రాజు యొక్క సింహాసనము యెదుట నిలువబడుదురు (మత్తయి 25:31-34).

చివరిగా రాజ్యము తండ్రికి అప్పగింపబడినను, రాజ్యములో యున్న వారందరు రక్షింపబడరు అని 1కొరింథీ 15లో బయలుపరచబడినది. గోదుమల నుండి గురుగులు వేరు చేయబడును. మత్తయి 7:16లో యేసు దీనిని గూర్చి హెచ్చరిక చేసియున్నారు. రాజ్యములో యున్న గురుగులను దూతలు పోగుచేసి నిత్యనరకాగ్నిలో వాటిని కాల్చివేతురు, నీతిమంతులైతే సూర్యునివలె తేజరిల్లుదురు. రాజ్యము నిశ్చలమైనది, అది నాశనములేనిది (హెబ్రీ 12:28; దానియేలు 2:44).

రాజ్యము ఏమైయున్నదో, అది ఎవరిదో, ఎందువలన అది యున్నదో, ఎక్కడికి వెళ్లుచున్నదో గమనించిన తరువాత దానిని మన జీవితంలో మొదట యుంచాలి. రాజ్యము యొక్క రాజే మనలను దానిలోనికి ఆహ్వానించుచున్నందున దానిలో ప్రవేశింపకపోతే అది ఎంతో దౌర్భాగ్యము!

- నీలపొలార్డ్

## సంక్షిప్త వార్తలు

2013 కొత్తపేట క్రీస్తుసంఘము ద్వారా మే నెల 1,2,3 తేదీలలో రెడ్డప్పవారి పేటనందు సువార్త కూడికలు బహుఘనముగా జరిగినవి. ఈ కూడికలలో సహోదరులు పి. చంద్రశేఖర్‌గారు (వైజాగ్ క్రీస్తుసంఘము), సహో॥ పి.డి.డి బిషప్‌గారు (మండపేట క్రీస్తుసంఘము) సహోదరుడు జయరాజుగారు (తణుకు క్రీస్తుసంఘము) వారు దేవుని వాక్యమును అందించిరి. ఈ కూడికల ద్వారా నలుగురు యవ్వనస్థులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. బిళ్ళకుర్రు, వాడపాలెం, తదితర చుట్టుప్రక్కల గ్రామముల నుండి అనేకులు ఈకూడికలలో పాలు పొందిరి. స్థానిక క్రీస్తుసంఘము దూర ప్రాంతముల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయములను కల్పించిరి. సహోదరులు ఎన్. నవజీవన్ బాబుగారు స్థానిక సంఘములో పరిచర్య చేయుచున్నారు.

2013 మే నెల 1,2,3 తేదీలలో వి.కె.రాయపురంలో యున్న ఒక ఇండిపెండెంట్ సంఘము వారు జరిపిన బహిరంగ సభలలో జాషువాగారు వాక్యపరిచర్యచేయగా, ఆ సంఘము సత్యముననుసరించినడుచుకొనుటకు తీర్మానము చేసికొనియున్నారు. త్వరలో వారందరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది ఆయనలో సంపూర్తిగ ప్రవేశించులాగున ప్రార్థించమనవి.

మే నెల 24,25,26 తేదీలలో కొత్తపేట మండలం వీధివారిలంకలో యున్న క్రీస్తుసంఘము గొప్పసువార్తకూడికలు జరిపిరి. ప్రతిరోజు వందలాదిమంది హాజరై దేవుని వాక్యమును శ్రద్ధగా వినిరి మొదటిరోజున యన్. నవజీవన్ గారు అధ్యక్షత వహించగా సోదరులు పి.జే. కృపాలినీ గారు గంభీరముగా దేవుని విమోచన పధకమును గూర్చి బోధించిరి. రెండవ రోజు సోదరులు బాబీగారు (అమలాపురం) అధ్యక్షతవహించగా కృపాలినీగారును, బాబుగారును కూడ గొప్ప వాక్యపరిచర్య చేసిరి. మూడవనాడు ఎ. అబ్బాయి గారు (వాడపాలెం) అధ్యక్షత వహించగా సోదరులు యన్. ఏలియాగారు (దేవగుప్తం) ధనవంతుడు లాజరును గూర్చి చెబుతు అనేక లోతైన విషయములు తెలియజేసిరి. సోదరులు యన్. జగజీవన్‌రాజు గారు కూడ వాక్యపరిచర్యలో పాలుపొందిరి. వీధివారిలంక సంఘములో యున్న యౌవనస్థులు తీవ్రముగా కృషిచేసిరి. దూరప్రాంతముల నుండి వచ్చిన వారందరికీ భోజనములు ఏర్పాటు చేయబడెను. వీధివారిలంకలో సోదరులు కోనాల దేవిడ్‌గారు ప్రభువుకొరకు నమ్మకమైన పరిచర్య చేయుచున్నారు. సువార్త కూటములు జరిగిన మూడు దినములు తీవ్రమైన వడగాల్పుల వలన ఆంధ్రప్రదేశ్‌లో వందలాది మృతిజెందినను, వీధివారిలంకలో వందలాది ప్రజలు హాజరై ఆత్మీయానుభూతిపొందిరి. గంభీర సువార్తకూటములు జరిపిన దేవిడ్‌రాజుగారు అభినందనీయులు.

# మీకొకగొప్పసదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

## Satya Vani

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004